మల్లన్న భక్తులకు తిప్పలు తప్పవా?

● మురుగు నీటిలో నుంచి వెళ్లి దర్శనాలు
● పట్టించుకోని ఆలయ అధికారులు


మురుగునీటిలో నడుస్తూ దర్శనానికి వెళ్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కోర్కెలు తీర్చే కొమురవెల్లి మల్లికార్జునుడి దర్శనానికి వచ్చే భక్తులకు మురుగు నీటి తిప్పలు తప్పడం లేదు. ఆలయ పరిసరాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి వారం ఏదో ఒక చోట ఆలయ పరిసర ప్రాంతాలలో ప్రవహించడం పరిపాటిగా మారింది. ఆలయ, పంచాయతీ అధికారులకు భక్తులు, స్థానికులు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజులగా స్వామి వారి కోడెల మండపం వద్ద డ్రైనేజీ పైపులు పగిలి మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్గంధం వెదజల్లింది. దీంతో భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయ అధికారులు స్పందించి సమస్య తలెత్తకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

మదిని దోస్తుందిగా.. 'మోదుగ'

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో మోదుగ చెట్లు విరబూసి బాటసారుల మదిని దోచుకొంటున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు అన్ని చెట్లు ఆకులు రాల్చి చిగురులతో ఆకట్టుకోగా మోదుగ చెట్లు మాత్రం పూలు వివసించి కనువిందు చేస్తున్నాయి. హోళీ పండగలకు ఈ పూలు అత్యంత ప్రాధాన్యం. మండలంలోని జనగామ, కట్కూర్, గండిపల్లి, రామవరం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు గుండా రెండు వైపులా కాషాయరంగులో ఉండి బాటసారులను కట్టిపడేస్తున్నాయి.


జనగామ గౌరవెల్లి మార్గంలో విరబూసిన మోదుగ పూలు

క్లుప్తంగా

సైక్లింగ్ చాంపియన్‌కు అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 9వ రాష్ట్రస్థాయి మౌంటైన్ బైక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ అండర్–16 విభాగంలో రాణించిన సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ప్రసాద్‌ను మంగళవారం ఉపాధ్యాయులు పాఠశాలలో అభినందించారు. 20 హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో ప్రసాద్ పాల్గొంటునట్టు వారు తెలిపారు. ప్రసాద్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో ఉపాధ్యాయులు రూ.6వేల ఆర్థిక సహాయం అందించారు.

కోటి తలంబ్రాల దీక్షలో భక్తులు


వడ్లను వలుస్తున్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పలువురు భక్తులు భద్రాచల రాములోరి కల్యాణానికి గోటితో తలంబ్రాలను ఒలిచారు. వాటిని శ్రీరామకోటి భక్త సమాజం నిర్వాహకులకు మంగళవారం అందించారు. వాటిని భద్రాచలంలో సీతారాముల కల్యాణంలో అక్షింతలుగా వాడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ దీక్షలో పాల్గొనడం సంతోషంగా ఉందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు


విద్యార్థులతో మాట్లాడుతున్న మధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, మధు మండిపడ్డారు. కేసీఆర్ డబుల్‌బెడ్రూం కాలనీ, గుండ్ల చెరువులలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం వారు పర్యటించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, ఆరుబయటనే తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినయ్, శ్రావణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య ఎప్పటికీ తరగని ఆస్తి


పరీక్ష సామగ్రి అందజేస్తున్న సుధాకర్ శర్మ

మద్దూరు(హుస్నాబాద్): విద్య అనేది ఎప్పటికీ తరగని ఆస్తి అని విశ్రాంత ఉపాధ్యాయుడు సుధాకర్‌శర్మ అన్నారు. దూల్మిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు చేరుకొని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పరీక్షలో మంచి ప్రతిభ కనబర్చిన వారికి రూ.5వేలు ప్రోత్సాహకం అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేతగాక విమర్శలు

బీఆర్‌ఎస్ నేత ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధి చేతగాని కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హరీశ్‌రావు కృషివల్లే సిద్దిపేట జిల్లా గణనీయంగా అభివృద్ధి సాధించిందన్నారు. కొందరు కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పు పొందడానికి కావాలనే విమర్శలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో మండుటెండల్లోనూ గోదావరి జలాలను అందించి రైతులకు పంట నష్టం జరగకుండా చూశామని గుర్తుచేశారు. రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


సిద్దిపేటరూరల్: వెంకటాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హరికృష్ణ

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలన్నీ అభివృద్ధిలో ముందుకు సాగుతాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.15లక్షలతో మంగళవారం సీసీ రోడ్డు, ఎస్‌డీఎఫ్ రూ.6 లక్షల నిధులతో డ్రైనేజి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల వారీగా పనులు చేపట్టి ఆదర్శగ్రామాలు తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీకృష్ణ, లక్ష్మి, బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, సదాశివారెడ్డి, మహేందర్‌రెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.

కాన్గల్‌లో..

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇచ్చిన హామీ మేరకు రూ.5లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాంభూపాల్‌రెడ్డి, ప్రేమలత, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పనులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఆయన వెంట శ్రీనివాస్, రమేశ్, శివకుమార్, సాగర్‌రావు, సుధాకర్, సుమన్, సతీశ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

77 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న వీరాపూర్ గ్రామంలోని 77 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ పునాదులు వరకు నిర్మాణాలు పూర్తిచేసిన వారికి మొదటి విడతగా రూ.లక్ష అందజేస్తామన్నారు. మండలంలో 3,835 మందిని లబ్ధిదారులుగా గుర్తించినట్లు చెప్పారు. రైతుల భూ అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకంలో డబ్బులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను రతలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొన్నట్టు తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. తిగుళ్ళ రాజు ఎలాంటి అనుమతి లేకుండా వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని రూ.10వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు జాబ్‌మేళా

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ కోరారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 35ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు తమ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

బోర్లు తొలగింపు లేదా?


మధ్యలో ఉన్న బోరు బావులు

హుస్నాబాద్‌రూరల్: జాతీయ రహదారి పనుల్లో భాగంగా రెండు వైపుల డ్రైనేజీలను నిర్మించడంతో కొందరి బోరు బావులు మధ్యలో వచ్చినా తొలగించకుండానే స్లాబ్‌లు వేశారు. అవి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


మిరుదొడ్డి(దుబ్బాక): స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


నంగునూరు(సిద్దిపేట): చిన్నారులతో ఉపాధ్యాయులు


దుబ్బాకటౌన్: ఎంఈఓ, హెచ్‌ఎంలతో విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): స్వపరిపాలనా దినోత్సవం సందర్భంగా మంగళవారం అంక్షాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డీఈఓగా చైత్ర, ఎంఈఓగా శ్రీనిత్, హెచ్‌ఎంగా అస్మిత, ఉపాధ్యాయులుగా హర్షిత, మనస్విని, అశ్విత, హర్షిణి, భానుప్రసాద్, శివవర్ధన్, సాత్విక్ వ్యవహరించారు. తమ బోధనతో ఆకట్టుకున్న విద్యార్థులను ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, నారాయణ, సత్యం అభినందించారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓగా భానుగౌడ్, ఎంఈఓగా విగ్నేశ్, హెచ్‌ఎంగా నవీన, టీచర్లుగా ఐశ్వర్య, ఆయేషా, మణికాంత్, భాను తేజ, నిత్య, దీక్షిత్ కుమార్, ప్రణీత, పీఈటీగా త్రిశూల్, భానుతేజ వ్యవహరించారు. వారికి ఎంఈఓ అంజయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరి, ఇందిర, యాదయ్య, వాలంటీర్లు సరిత, నవిత, నిహారిక బహుమతులు ప్రదానం చేశారు.

కృష్ణసాగర్ ప్రాథమిక పాఠశాలలో

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం కృష్ణసాగర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. హెచ్‌ఎంగా రిషిక్ కుమార్, ఉపాధ్యాయులుగా వర్షిణి, హేమాన్య వ్యవహరించారు. హెచ్‌ఎంలు నాగరాజు, అంజిరెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడండి: మహాదేవ్‌స్వామి


ధర్మసభలో ప్రసంగిస్తున్న మహాదేవ్‌స్వామి

కొమురవెల్లి(సిద్దిపేట): భగవంతుడిని కొలుస్తూ సనాతన ధర్మాన్ని కాపాడాలని సద్గురు మహాదేవ్ స్వామి పిలుపునిచ్చారు. బుధవారం కొలనుపాకలో జరిగే జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా కామరెడ్డిజిల్లా గుడిమెట్ పన్నెండు వందల మందితో ప్రారంభమైన రేణుకాచార్య మహాపాదయాత్ర మంగళవారం కొమురవెల్లికి చేరుకొంది. సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదితరులు మహదేవ్ స్వామికి ఆహ్వానం పలికారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ధర్మసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపేంద్రశర్మ, శ్రీనివాస్, నాగయ్య, మల్లయ్య, ఆంజనేయులు, భాస్కర్, రవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **తప్పులు చేయొద్దు**

సిద్దిపేటకమాన్: తొందరపాటు పనులతో తప్పులు చేయవద్దని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి సూచించారు. జిల్లా జైలును మంగళవారం ఆమె సందర్శించారు. జైలులోని వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు లేని వారికి న్యాయ సహాయం అందిస్తారన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **తీర్పు కనువిప్పు కావాలి: డీబీఎఫ్**

గజ్వేల్: కులాంతర, మతాంతర వివాహాలను అడ్డుకొనే వాళ్లకు ప్రణయ్ తీర్పు కనువిప్పు కావాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018లో జరిగిన ఈ ఘటనలో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవిత ఖైదు విధించడం ఆహ్వానించతగ్గదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ తీర్పు కనువిప్పు కావాలని తెలిపారు.

◆ **చట్టాలపై అవగాహన అవసరం**

దుబ్బాకటౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి సూచించారు. రాయపోల్ కేజీబీవీ పాఠశాలలో సైబర్ నేరాలు, వివిధ చట్టాల గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ సుగంధలత, గజ్వేల్ షీటీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు, పోలీస్ సిబ్బంది లావణ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా మహిళా దినోత్సవం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మనోహర్ మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. మహిళ లేనిదే లోకం లేదని చెప్పారు. అమ్మగా, సోదరిగా, ఉపాధ్యాయురాలిగా విధుల నిర్వహిస్తూ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉదయశ్రీ, బాల సరస్వతి, ప్రభ, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమగ్రశిక్షా తెలంగాణ, భారత కృతిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీటీసీ భవన్(ఉపాధ్యాయ భవన్)లో అర్హత పొందిన దివ్యాంగులకు ఈ ఉపకరణాల పంపిణీ చేస్తారని తెలిపారు.

◆ **ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష**

బెజ్జంకి(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ పిలుపు మేరకు బెజ్జంకిలో ఆ సంఘం నాయకులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకనే గ్రూపు2 ఫలితాలు, ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములు, తిరుపతిరెడ్డి, మానకొండూర్ ఇన్‌చార్జి పరశురాములు, భూమయ్య, రాజు, ఎల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **18న తైబజార్‌కు వేలం**

దుబ్బాక: జిల్లాలోనే పెద్దఅంగడిగా పేరొందిన దుబ్బాక పశువుల, కూరగాయల అంగడికి(తైబజార్‌కు) 18న వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు యేడాది కాలానికి గాను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనేవారు కూరగాయల అంగడికి రూ.25 వేలు, పశువుల అంగడి కోసం రూ.25 వేలు డీడీ తీసి 17 సాయంత్రం 5 గంటల్లోగా మున్సిపల్ కార్యాలయంలో అప్పగించాలని కోరారు.

మరిన్ని రికార్డులు సృష్టించాలి


కార్తీకను సన్మానిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్: కార్తీక మరిన్ని రికార్డులు సాధించాలని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆవర్తన మూలకాలను అతి తక్కువ సమయంలో కంఠస్థంచేసి ప్రపంచ రికార్డు సృష్టించిన రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పంజాల కార్తీకను మంగళవారం ఆయన సన్మానించారు. పీఆర్టీయూ టీఎస్ మండలశాఖ తరపున కార్తీకతో పాటు సలహాదారుడు కొల్కూరి భాస్కర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్తీకకు రూ.3వేల నగదు బహుమతి, డిక్షనరీలను అందించారు. హెచ్‌ఎంలు అంజిరెడ్డి, నాగరాజ్ సుధాకర్ రెడ్డి, పీఆర్టీయూ నాయకులు ఇంద్రసేనారెడ్డి, కనకారెడ్డి, తులసీదాస్, నాగరాజు, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అగ్గి తెగులు నివారణ

ఏడీఏ పద్మ, ఏఓ శ్రీనాథ్


అగ్గి తెగులు సోకిన పైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సిద్దిపేటఅర్బన్: వరి పైరుకు తీవ్రమైన నష్టం కలిగించే అగ్గి తెగులును ప్రారంభ దశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని సిద్దిపేట ఏడీఏ పద్మ, మండల ఏఓ బి.శ్రీనాథ్ అన్నారు. అర్బన్ మండలం వెల్కటూరులో అగ్గితెగులు సోకిన వరి పైరును మంగళవారం వారు పరిశీలించి రైతుకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రివేళ ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం, ఆకులపై మంచు ప్రభావం, నత్రజని అధిక వినియోగం వల్ల అగ్గి తెగులు వస్తుందన్నారు. ఆకులపై నూలు కండె ఆకారంలో బూడిద రంగు మచ్చల చుట్టూ ఇటుకరంగులో ఉండే అగ్గితెగులు లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తించి నివారించకపోతే తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. నివారణ కోసం ట్రైసైక్లాజోల్ 120గ్రా. లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్, టెబుకోనజోల్ 90గ్రా. ద్రావణాన్ని లేదా పికాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లాజోల్ 400 మి.లీ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు.

గంగమ్మకు అన్నదాతల పూజలు


పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): మండుటెండలో పొంగి ప్రవహిస్తున్న వాగు నీటిని చూసి అన్నదాతలు పరవశించిపోయారు. ఇన్నాళ్లు చుక్క నీరు లేక వెలవెలబోయిన వాగులో గలగల పారుతున్న గంగమ్మకు మంగళవారం హారతి పట్టి పూజలు చేశారు. భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు ఎండిపోతున్న తరుణంలో ప్రభుత్వం రంగనాయకసాగర్ నీటిని విడుదల చేయడంతో ఐదు రోజుల కిందట నాగరాజుపల్లి చెరువు మత్తడి దూకింది. అక్కడి నుంచి నీటి ప్రవాహం పెరగడంతో నంగునూరు మండలం గుండా పారే మోయతుమ్మెద వాగులో ప్రవాహం పెరిగింది. దీంతో మంగళవారం ఘణపూర్ వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ మత్తడి దూకడంతో గ్రామ రైతులు కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలతో పాటు గంగమ్మకు పూజలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలుచేసి గంగమ్మకు హారతి పట్టారు. మత్తడి నీటితో వాగు ప్రవాహం పెరగడంతో అక్కేనపల్లి, నంగునూరు, సిద్దన్నపేట శివారులో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నిండనున్నాయి.

మెరుగైన విద్యా బోధనే ధ్యేయం

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


క్రీడల్లో రాణించిన విద్యార్థులతో డీఈఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): మెరుగైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలను తీసుకొచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పోటీపరీక్షల్లో విద్యార్థులు పాటించవల్సిన మెలకువలు గురించి వివరించారు. సమయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఆందోళనలకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనం, మౌలిక వసతుల కల్పన తీరును పరిశీలించారు. అదేవిధంగా వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. అందుకు కృషిచేసిన పీఈటీ వెంకటనర్సయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రంగానాయక్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనులపండువగా బోనాల ఊరేగింపు


పెద్దమ్మ తల్లికి బోనాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ముదిరాజ్ కులస్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముదిరాజ్‌ల ఇళ్ల నుంచి డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, బైండ్ల వారి ఆటపాటలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించుకున్నారు. సుమారు మూడు గంటల పాటు బోనాల ఊరేగింపు కొనసాగింది. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా లక్ష పుష్పార్చన


సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ భూనీలా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ 55వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్షపుష్పార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పుష్పాలు, తీర్థప్రసాదాలు అందించారు. బుధవారం స్వామికి ఏకాంత సేవ, తదితర కార్యక్రమాలతో వార్షికోత్సవాలు ముగియనున్నాయి.